సాక్షి రాజన్న సిరిసిల్ల

శుక్రవారం, 9, జూన్, 2023



పెద్దమ్మ బోనాలు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగిలోని తూర్పు వాడ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం పెద్దమ్మ బోనాలు తీశారు. బైండ్లోళ్ల ఆటపాటల మధ్య బోనాలు తీసుకెళ్లారు.



కొయ్యకాళ్ల మంటలే..

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ శివారులోని పొలాల్లో రైతులు కొయ్యకాళ్లను కాల్చివేయడంతో రాత్రి వేళ పెద్ద ఎత్తున మంటలు లేచాయి.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 42.0/30.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

చెరువుల సంబురం



సిరిసిల్లలో సాంస్కృతిక కార్యక్రమాలు



వెంకటాపూర్‌లో బతుకమ్మలతో కలెక్టర్, ఎస్పీ



వేములవాడలో కేసీఆర్ చిత్రపటం వద్ద నాయకులు



సిరిసిల్లలో బతుకమ్మలతో చైర్‌పర్సన్ జిందం కళ

వేములవాడ/సిరిసిల్లఅర్బన్/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా గురువారం చెరువుల పండుగ నిర్వహించారు. మహిళలు బోనాలతో తరలివచ్చి కట్టమైసమ్మకు నైవేద్యం సమర్పించగా, బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేశారు. కోనరావుపేట, సుద్దాల గ్రామాల్లోని చెరువు పండుగలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పాల్గొన్నారు. సిరిసిల్లలోని కొత్తచెరువు వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేములవాడలోని గుడిచెరువు వద్ద రంగురంగుల కేసీఆర్ చిత్రం వద్ద సెల్ఫీలు దిగేందుకు జనం ఎగబట్టారు. బతుకమ్మ ఆడేందుకు భారీగా మహిళలు వచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు జిందం కళాచక్రపాణి, రామతీర్థపు మాధవి, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య



బడిబాటలో పాల్గొన్న డీఈవో రమేశ్

ముస్తాబాద్(సిరిసిల్ల): సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఈవో రమేశ్ కుమార్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో గురువారం బడిబాటలో పాల్గొన్నారు. కేజీబీవీ పాఠశాలను, ముస్తాబాద్‌లో సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. పాఠశాలల పునర్ ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని సూచించారు. హెచ్ఎం రవీందర్, ప్రత్యేకాధికారి శ్రీలత తదితరులు ఉన్నారు.

నిరుపేదల ఇళ్లను తొలగించడం సరికాదు



రాజీవ్‌నగర్‌లోని బాధితులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

సిరిసిల్లఅర్బన్: నిరుపేదల ఇళ్లను తొలగించాలని యత్నించడం సరికాదని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లోని ఈదుల చెరువుకు సమీపంలోని కార్మికుల ఇళ్లను గురువారం పరిశీలించి మాట్లాడారు. దాదాపు 150 కుటుంబాలు 25 ఏళ్లుగా ఇక్కడే గుడిసెలు, ఇళ్లు కట్టుకొని ఉంటున్నాయన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం వంద గజాలలోపు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చిందని గుర్తు చేశారు. వారు పన్నులు చెల్లించారని, కానీ బఫర్‌జోన్‌గా ప్రకటించి, ఇళ్లను తొలగించాలని ఆదేశాలివ్వడం సరికాదన్నారు. నాయకులు చిందం శ్రీనివాస్, అక్కినేని సతీశ్, జడల రాజు తదితరులు ఉన్నారు.

మళ్లీ పీహెచ్‌సీ పనుల అడ్డగింత



శిథిలావస్థకు చేరిన భవనం ఇదే

చందుర్తి(వేములవాడ): మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవన పనులను స్థానిక ప్రజాప్రతినిధుల భర్తలు గురువారం అడ్డుకున్నారు. మండలకేంద్రంలో 1959లో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనం శిథిలావస్థకు చేరింది. దీని స్థానంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు ఫిబ్రవరి 22న ఎమ్మెల్యే రమేశ్‌బాబు భూమిపూజ చేశారు. భవన నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్లను కాంట్రాక్టర్ నరికి వేయించడంతో అప్పుడు మండల ప్రజాప్రతినిధి భర్త, గ్రామ ప్రజాప్రతినిధి భర్తలు అడ్డుకున్నారు. దీంతో రెండునెలలపాటు పనులు నిలిచిపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేయగా తిరిగి ప్రారంభించారు. స్థానిక ప్రజాప్రతినిధి భర్త నెల క్రితం రెండోసారి అడ్డుకున్నారు. తిరిగి కాంట్రాక్టర్ గురువారం శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించే పనులు చేపట్టగా స్థానిక ప్రజాప్రతినిధుల భర్తలు అడ్డుకున్నారు. ప్రస్తుతం ఉన్న భవనంలోనే 15 పడకల వైద్యం అందించవచ్చని, నూతనంగా 10 పడకల ఆస్పత్రి భవనం నిర్మించడం అవసరమా అంటు అడ్డుకున్నారు. 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి కావాల్సిన నిధుల కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని కాంట్రాక్టర్‌తో వాదనకు దిగారు. దీంతో తాను పనులు చేయలేనని, కాంట్రాక్టర్ వెనుదిరిగినట్లు తెలిసింది. గ్రామంలో మాత్రం భవన నిర్మాణానికి మంజూరైన రూ.1.50 కోట్ల పనుల్లో పర్సంటేజీ కోసం అడ్డుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాల్సిన ప్రజాప్రతినిధుల భర్తలే అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.

రెండూళ్లకో సబ్‌స్టేషన్



మాట్లాడుతున్న చైర్మన్ చిక్కాల రామారావు



సమావేశానికి హాజరైన గ్రామ ప్రాతినిధ్య సభ్యులు

- ట్రాన్స్‌ఫార్మర్ల రవాణాకు మరో నాలుగు వాహనాలు
- ఎన్పీడీసీఎల్ తరహాలో రైతులకు విద్యుత్ కనెక్షన్లు
- విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబరు
- లూజ్ వైర్లను తొలగిస్తాం.. అవుట్ సోర్సింగ్‌లో నియమిస్తాం
- విద్యుత్ బిల్లుల వసూళ్లలో కఠినంగా ఉంటాం
- 'సెస్' మహాసభలో చైర్మన్ చిక్కాల రామారావు

సిరిసిల్ల: జిల్లాలో నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేసేందుకు రెండు గ్రామాలకు ఒక్క విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామని సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) చైర్మన్ చిక్కాల రామారావు పేర్కొన్నారు. సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో గురువారం 'సెస్' గ్రామ ప్రాతినిధ్య సభ్యులతో మహాసభ నిర్వహించారు. చిక్కాల రామారావు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 74 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయని, కొత్తగా మరో 30 సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మధ్యమానేరు ముంపు గ్రామాల్లో మునిగిన విద్యుత్ సబ్‌స్టేషన్ల స్థానంలోనూ కొత్త వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఇవి పూర్తయితే లోవోల్టేజీ లేకుండా కరెంట్ సరఫరా అవుతుందని వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్లు పాడైనప్పుడు వెంటనే మరమ్మతు చేసి రీప్లేస్‌మెంట్ చేస్తామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల రవాణాకు నాలుగు వాహనాలు ఉన్నాయని, పాడైనవి మరో ఐదు ఉన్నాయని, కొత్తగా మరో నాలుగింటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 'సెస్' పరిధిలో టోల్ ఫ్రీ నంబరు 18004250104 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్పీడీసీఎల్ తరహాలో రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని, ఇందుకు 'సెస్' బైలాలో మార్పులు చేస్తున్నట్లు రామారావు స్పష్టం చేశారు. 'సెస్' ఉద్యోగుల అన్ని సర్వీసుల నియమ, నిబంధనలను రద్దు చేస్తూ.. ఉద్యోగుల నూతన సర్వీసు రూల్స్‌ను అమలులోకి తెస్తామన్నారు.

అవుట్ సోర్సింగ్‌లో నియామకాలు

భవిష్యత్‌లో 'సెస్' పరిధిలో అవసరాన్ని బట్టి క్షేత్రస్థాయిలో అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగులను పారదర్శకంగా నియమించనున్నట్లు తెలిపారు. లూజ్ వైర్లను తొలగిస్తామని, ఇందుకు మండలానికి వంద స్తంభాలను అందిస్తామన్నారు. ప్రభుత్వం ద్వారా రావాల్సిన విద్యుత్ బకాయిల వసూళ్లకు లైజన్ ఆఫీసర్‌ను నియమిస్తామని, క్షేత్రస్థాయిలో విద్యుత్ బిల్లుల వసూళ్లు, బకాయిల వసూళ్లలో కఠినంగా ఉంటామన్నారు. మూడు హెచ్‌పీల విద్యుత్ సర్వీసుల మంజూరును తొలగించి 5 హెచ్‌పీ, 7.5 హెచ్‌పీలు ఇస్తామని, 10 హెచ్‌పీలకు విద్యుత్ రాయితీ వర్తించదని స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్లను బిగిస్తామన్నారు. 2018 నుంచి 2023 వరకు జమ–ఖర్చులను ఆమోదించారు. పాలకవర్గం సిట్టింగ్ ఫీజు పెంచుటకు మహాసభలో ఆమోదం లభించింది. 'సెస్' వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.రామకృష్ణ, డైరెక్టర్లు దిడ్డి రమాదేవి, దార్నం లక్ష్మీనారాయణ, మల్లుగారి రవీందర్‌రెడ్డి, గొరినేని నారాయణరావు, సందుపట్ల అంజిరెడ్డి, వరుస కృష్ణహరి, మాడుగుల మల్లేశంయాదవ్, పొన్నాల శ్రీనివాస్‌రావు, ఆకుల గంగారాం, నామాల ఉమ, రేగులపాటి హరిచరణ్‌రావు, ఆకుల దేవరాజం, కొట్టెపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'సెస్' ప్రగతి, సంస్కరణలపై డాక్యుమెంటరీ ప్రదర్శించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులో ఉంచాలి



ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినప్పుడు దాన్ని తీసుకెళ్లి రిపేరు చేసి తేవడంలో జాప్యమవుతుంది. అన్ని గ్రామాల్లో ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌ను అదనంగా అందుబాటులో ఉంచాలి. మూడేళ్లకోసారి ఉద్యోగులను బదిలీ చేయాలి. ఒకే చోట పాతుకుపోకుండా చూడాలి. ముందుగా ఆఫీస్‌లోని స్టాఫ్‌ను బదిలీ చేయాలి.

– కల్వకుంట్ల గోపాల్‌రావు, మోహినికుంట

హెల్పర్లకు పదోన్నతి కల్పించాలి



'సెస్' పరిధిలో నిజమైన శ్రామికులు హెల్పర్లు. వారి సర్వీసును పరిగణలోకి తీసుకుని అర్హతను బట్టి పదోన్నతి కల్పించాలి. స్టోర్స్‌కు స్థలాన్ని సేకరించి శాశ్వత 'సెస్' స్టోర్స్‌ను నిర్మించాలి. నూకలమర్రిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో దళితులకు విద్యుత్ సర్వీసులు అందించాలి.

– బొడ్డు నారాయణ, నూకలమర్రి

ఎజెండా కాపీలు ముందే ఇవ్వాలి



మహాసభ ఎజెండా కాపీలను గ్రామ ప్రాతినిధ్య సభ్యులకు వారం రోజుల ముందే పంపించాలి. దాన్ని చదువుకుని సభకు వచ్చే అవకాశం ఉంటుంది. ఇలా మీరు చదవడం మేం చదవడంతోనే సరిపోతుంది. మరో సభ వరకు ముందే అందించే ఏర్పాట్లు చేయాలి. ట్రాన్స్‌ఫార్మర్లను ట్రాక్టర్లలో తరలిస్తే కిరాయి సంస్థ నుంచి చెల్లించాలి.

– కట్ట నర్సింహారెడ్డి, వల్లంపట్ల

సేవ చేసేందుకే ఉన్నాం



'సెస్' గ్రామ ప్రాతినిధ్య సభ్యులుగా వినియోగదారులకు సేవ చేసేందుకే ఉన్నాం. మహాసభకు వస్తే మీరు చెల్లించే రూ.500 నాకు అక్కర లేదు. వాపస్ ఇస్తున్నాను. సంస్థ ద్వారా డబ్బులు తీసుకోవడం సరికాదు. ఎన్పీడీసీఎల్ తరహాలో రైతులకు విద్యుత్ సర్వీసులు ఇవ్వడం మంచి పరిణామం, 'సెస్' సిబ్బంది ఫోన్ నంబర్లను గ్రామపంచాయతీల్లో రాయించాలి. సిబ్బందికి, ఉద్యోగులకు బయోమెట్రిక్ అమలులోకి తేవాలి.

– జోగినిపెల్లి సంపత్‌రావు, నర్సింగాపూర్

ఆక్వాహబ్‌గా సిరిసిల్ల



మహిళా మత్స్యకార సంఘం సభ్యులకు మంజూరు పత్రాన్ని అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- సిరిసిల్లలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

సిరిసిల్ల: చేపల పెంపకానికి కేంద్రంగా, ఆక్వాహబ్‌గా జిల్లా మారుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. సిరిసిల్ల మానేరు తీరంలోని రైతుబజారులో మత్స్యశాఖ ఏర్పాటు చేసిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను గురువారం ప్రారంభించి మాట్లాడారు. మధ్యమానేరు జలాశయం బ్యాక్‌వాటర్‌లో చేపల పెంపక కేంద్రం ఏర్పాటు అవుతుందన్నారు. 366 ఎకరాల్లో ఆక్వాహబ్ ఏర్పాటుకు పలు కంపెనీలు ముందుకొచ్చాయని, ఐదు వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. మత్స్యరంగానికి సీఎం కేసీఆర్ ఊపిరి పోశారని, రూ.వెయ్యి కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. చేపల మార్కెట్లు, మత్స్యకారులకు ద్విచక్రవాహనాలు, ఫోర్‌వీలర్లు అందించారని గుర్తు చేశారు. 150 మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్ లెట్లను ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 600 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహించేలా ప్రభుత్వం ప్రోత్సహించిందన్నారు. సిరిసిల్లలో మూడు రోజులపాటు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస, జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



నోరూరించే చేపల వంటకాలు

నోరూరించే వంటకాలు

సిరిసిల్ల రైతుబజారులో ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్‌లో నోరూరించే వంటకాలను ఏర్పాటు చేశారు. మహిళలు తయారు చేసిన చేపల వంటకాలను జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ రుచి చూశారు.

ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

చందుర్తి(వేములవాడ): ఆలయాల అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని కట్టలింగంపేటలో గురువారం నిర్వహించిన చెరువుల పండుగకు హాజరయ్యారు. బతుకమ్మలతో ర్యాలీగా చెరువు వద్దకు వెళ్లి నిమజ్జనం చేశారు. అనంతరం గంగమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ కట్టలింగంపేటలో ఆలయాల నిర్మాణానికి రూ.32 లక్షలు కేటాయించామన్నారు. గురున్నాథం చెరువును రూ.45 లక్షలతో మరమ్మత్తులు చేపట్టినట్లు తెలిపారు. కౌన్సిలర్ శ్రీనివాస్‌రావు, సర్పంచ్ ఏనుగుల జమున, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య పాల్గొన్నారు.



కట్టలింగంపేటలో బతుకమ్మలతో ఎమ్మెల్యే

పుస్తకాల సరఫరాకు టెండర్‌ల ఆహ్వానం

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు మండల వనరుల కేంద్రాల నుంచి పాఠశాలలకు లోడింగ్, అన్‌లోడింగ్ చేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి టెండర్‌లు ఆహ్వానిస్తున్నట్లు గురువారం డీఈవో రమేశ్‌కుమార్ తెలిపారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు టెండర్‌దారులు రూ.వెయ్యి జాతీయ బ్యాంకులో డీడీలు తీసి దరఖాస్తు ఫారాలు పొందాలని సూచించారు. వివరాలకు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రజల భద్రత కోసమే పోలీసులు

- అన్ని వేళల్లో అందుబాటులో ఉంటాం : ఎస్పీ అఖిల్‌మహాజన్

వీర్నపల్లి(సిరిసిల్ల): ప్రజల భద్రత కోసమే పోలీసులు ఉన్నారని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. వీర్నపల్లి మండలం రంగంపేటలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యంపై అశ్రద్ధ చూపొద్దని సూచించారు. మారుమూల అటవీ ప్రాంతంలో పోలీసులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ వైద్యశిబిరంలో దాదాపు 280 మంది వరకు పరీక్షలు చేయించుకున్నారు. ఏఎస్పీ చంద్రయ్య, సీఐలు మొగిలి, కిరణ్, ఎస్సైలు నవత, ప్రభాకర్, వైద్యులు విక్రమ్‌సింహారెడ్డి, అరుణ, నీలిమ, లక్ష్మీప్రియ, అభినయ్, రవీందర్, యాదగిరిగౌడ్, సర్పంచ్ నందగిరి లింగం, ఎంపీటీసీ పంబాల రేణుక పాల్గొన్నారు.

రుద్రంగి(వేములవాడ): ప్రజల భద్రత కోసమే పోలీసులు ఉన్నారని, అన్ని వేళల్లో అందుబాటులో ఉంటారని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. మండలంలోని మానాలలో జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. దాదాపు 300 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ అటవీ ప్రాంత ప్రజలకు పోలీస్ సేవలపై నమ్మకం కలిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పిల్లలు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, చందుర్తి సీఐ కిరణ్, రుద్రంగి ఎస్సై ప్రభాకర్, వైద్యులు విక్రమ్ సింహారెడ్డి, అరుణ, నీలిమ, లక్ష్మీప్రియ, అభిరామ్, రవీందర్, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.



ఎస్పీకి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

గుడి చెరువులో గోదావరి నీళ్లేవి?



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ: రాజన్న గుడి చెరువును పూడ్చి ఏళ్లు గడుస్తున్నా ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేశారు. గుడి చెరువును కాపాడుకో తల్లీ అంటూ మొక్కుకున్నారు. అనంతరం గుడి చెరువులోకి వచ్చే గోదావరి నీళ్లను పరిశీలించారు. ఖాళీగా కనిపించిన పైప్‌లైన్ల వద్ద నిరసన తెలిపారు. రాజన్న సాక్షిగా ఇచ్చిన హామీలను అమలు చేసిన తర్వాతే చెరువుల పండుగలు చేసుకోవాలన్నారు. సాగారం వెంకటస్వామి, చిలుక రమేశ్, పాత సత్యలక్ష్మి, తోట లహరి, దేవయ్య, నాగుల విష్ణు, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, సాబీర్, కృష్ణ, కనికరపు రాకేశ్, కర్ణాకర్, రాజు పాల్గొన్నారు.

అచేతన స్థితిలో హమాలీ.. ఆదుకోవాలని వేడుకోలు

- మూడు నెలలుగా మంచానికే పరిమితం
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

ముస్తాబాద్(సిరిసిల్ల):పనిచేస్తేనే కుటుంబం గడిచే పరిస్థితి. ఒక్క రోజు పనికి వెళ్లకపోతే ఒక్క పూట గడవని దుర్భర స్థితి. అలాంటి కుటుంబాన్ని విధి వక్రీకరించింది. హమాలీ పనిచేసుకుని బతికే మండల కేంద్రానికి లోకం రాజయ్య అచేతనస్థితితో మంచానికే పరిమితమయ్యాడు. చికిత్సతోపాటు పూటగడిచేందుకు సైతం చేతిలో చిల్లి గవ్వ లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు.

ఇప్పటికే రూ.4లక్షల అప్పు

ముస్తాబాద్‌కు చెందిన లోకం రాజయ్య హమాలీ. మూడు నెలల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. అల్సర్‌తో ఇబ్బందులు పడుతున్న రాజయ్యను కరీంనగర్, సిరిసిల్ల, హైదరాబాద్ ఆస్పత్రులలో చూపించారు. కదలలేని స్థితిలోకి రాజయ్య వెళ్లాడు. రూ.4లక్షల వరకు అప్పు చేసి ప్రైవేటు ఆస్పత్రులలో వైద్యం చేయించిన రాజయ్య కోలుకోలేదు. రాజయ్యకు రక్తం తక్కువగా ఉండడం, జీర్ణాశయ ఆపరేషన్‌కు భారీ మొత్తంలో డబ్బు అవసరం ఏర్పడింది. కనీసం మంచినీళ్లు కూడా తాగే పరిస్థితి లేక చిక్కిపోయాడు. రాజయ్య భార్య మల్లవ్వ కూలీ పనులు చేస్తుంటుంది. వీరి కుమారుడు వెంకటేశ్ దివ్యాంగుడు. చేతిలో చిల్లిగవ్వ కూడా లేని వారికి ప్రస్తుతం తిండికే ఇబ్బందులు పడుతున్నారు. ఆపరేషన్‌కు కనీసం రూ.2లక్షలు కావాలని వైద్యులు చెప్పారు. మానవతావాదులు ఆదుకోవాలని భార్య మల్లవ్వ, దివ్యాంగుడైన కొడుకు వెంకటేశ్ వేడుకుంటున్నారు. రాజయ్య వైద్యానికి సహకరించే వారు 83676 65116 నంబర్‌లో సంప్రదించవచ్చు.



కదలలేని స్థితిలో రాజయ్య, పక్కన భార్య మల్లవ్వ

ఆర్థిక సహాయం చేసే దాతలు

లోకం మల్లవ్వ,
యూనియన్ బ్యాంక్ ఇండియా, ముస్తాబాద్
ఖాతా నంబర్ : 084410100039027
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : యూబీఐఎన్0808440

క్లుప్తంగా

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


శ్యాగ చంద్రయ్య (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని చిన్నలింగాపూర్‌కు చెందిన శ్యాగ చంద్రయ్య(58) గురువారం తన వ్యవసాయ క్షేత్రం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు. శ్యాగ చంద్రయ్య తన చిన్న కూతురు వివాహానికి అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియక బాధపడుతూ ఉండేవాడు. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి లుంగీతో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శ్యాగ లక్ష్మి ఫిర్యాదుతో తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- పరీక్ష రాయనున్న 3897 మంది విద్యార్థులు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలను ఈనెల 12 నుంచి 19 వరకు నిర్వహించనునట్లు ఇంటర్మీడియట్ విద్యాధికారి మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫస్టియర్‌లో 2,617 మంది, సెకండియర్‌లో 1,280 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

- రూ. 1,26,890 స్వాధీనం


పోలీసులకు పట్టుకున్న నగదు

సిరిసిల్ల క్రైం: గ్యాంబ్లింగ్, బెట్టింగ్, పేకాట ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద బోనాల గ్రామ శివారులో పేకాటస్థావరంపై గురువారం పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఏడుగురిని అరెస్ట్ చేసి వారినుంచి రూ. 1,26,890 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారన్నారు. జిల్లాలో నిత్యం టాస్క్‌ఫోర్స్, పోలీసుల ఆధ్వర్యంలో పేకాట స్థావరాలపై నిఘా ఉంచి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం అందించాలన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి


బైక్ నెంబర్ రాయిస్తున్న ఎస్సై మహేందర్

బోయినపల్లి: వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్సై మామిడి మహేందర్ అన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... నెంబర్ ప్లేట్లు లేని పలు వాహనాలను తనిఖీ చేసి వాటికి నెంబర్ రాయించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, తమ వెంట వాహన పత్రాలు తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పక్కదారి పట్టకుండా 'ప్రత్యేక' ముద్ర

- అంగన్‌వాడీ గుడ్లపై ప్రభుత్వ గుర్తు
- జిల్లాలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు
- మొదలైన పంపిణీ ప్రక్రియ


ప్రత్యేక ముద్ర వేసిన కోడిగుడ్లను పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

గంభీరావుపేట(సిరిసిల్ల): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందించే కోడిగుడ్లు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. కేంద్రాలకు సరఫరా చేసే ప్రతి గుడ్డుపై ప్రభుత్వం «ప్రత్యేక» (అంగన్‌వాడీ గుడ్లు – తెలంగాణ ప్రభుత్వం) ముద్ర వేస్తోంది. ఇకపై అంగన్‌వాడీ కోడిగుడ్లు ఎక్కడ కనిపించినా సులభంగా గుర్తించేందుకు వీలు కలిగింది. నెలలో మూడు విడతలుగా పంపిణీ చేసే కోడిగుడ్లపై మూడు రంగులు బ్లూ, రెడ్, గ్రీన్‌తో ముద్రించి సరఫరా చేయనుంది. జిల్లాలోని ఐసీడీఎస్ పరిధిలో సిరిసిల్ల, వేములవాడ ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టుల పరిధిలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఈనెల నుంచే ప్రత్యేక ముద్ర వేసిన కోడిగుడ్ల పంపిణీ ప్రక్రియ మొదలైంది.

అక్రమాలకు చెక్..

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని, ప్రాథమిక విద్య బలోపేతం చేయాలనే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వాటి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కోడిగుడ్లతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. కొన్నిచోట్ల అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, సరుకులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలున్నాయి. కుళ్లిన, చిన్నపాటి పరిమాణం కలిగిన గుడ్లు సరఫరా చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈ క్రమంలో మాతా, శిశు సంక్షేమ శాఖ కొన్ని చర్యలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే కోడిగుడ్లపై ముద్రలు వేసి పంపిణీ చేసే కొత్త విధానాన్ని ప్రారంభించింది. దీంతో అంగన్‌వాడీ అక్రమాలకు చెక్ పడనుంది.


ప్రభుత్వ గుర్తు వేసిన కోడిగుడ్లు

ప్రభుత్వ నిర్ణయం బాగుంది



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే కోడిగుడ్లపై ముద్ర వేసి ఇవ్వడం మంచి నిర్ణయం. కోడిగుడ్లు పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకు అందే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రంలో ముద్రవేసిన గుడ్లను అందిస్తున్నారు.
– లక్ష్మి, గంభీరావుపేట

లబ్ధిదారులకు ప్రయోజనం



ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్ర వేసిన కోడిగుడ్లు అంగన్‌వాడీ కేంద్రానికి వ చ్చాయి. వాటినే లబ్ధిదారులకు అందజేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు నేరుగా కేంద్రాలకు వచ్చి సకాలంలో పౌష్టికాహారం తీసుకెళ్లాలి. ముద్రతో లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుంది.
– భాగ్య, అంగన్‌వాడీ టీచర్, గంభీరావుపేట

ప్రజల సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


రోడ్డుపై బైఠాయించిన యువకులు

ఇల్లంతకుంట(మానకొండూర్): ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని అనంతారంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చెరువుల పండుగకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుకు ముందు నెర్రెలుబారిన నేలలు, ఎండిన చెరువులు కనిపించేవని.. నేడు కాళేశ్వరం నీటితో ఈ ప్రాంతం జలకళ సంతరించుకుందన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో మీర్జా, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, ఎంపీటీసీ పుష్పలత ఉన్నారు.

దళితకాలనీలో సమస్యలు పరిష్కరించాలి

అనంతారంలోని దళితకాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామానికి చెందిన దళిత యువకులు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. యువకులు మాట్లాడుతూ తమ గ్రామంలోని దళితకాలనీలో అభివృద్ధి చేయలేదన్నారు. సర్వేనంబర్ 601లో కొన్నేళ్ల క్రితం ఇచ్చిన పట్టాలను రద్దు చేశారన్నారు. ఎస్సై రాజేశ్ వారించే ప్రయత్నం చేయగా వాగ్వాదం జరిగింది.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మోహన్ ఆదేశాల మేరకు గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, కవితా పోటీలు నిర్వహించారు. తెలంగాణ అస్థిత్వం, సంస్కృతి, వైభవం తదితర అంశాలపై చిత్రలేఖనం, కవితలు రాశారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణ, పర్శరాములు, చంద్రమౌళి, భూమక్క, కవిత, విష్ణుప్రసాద్, లక్ష్మీనర్సవ్వ, విమల్ కుమార్, తాజొద్దీన్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య


ర్యాలీలో పాల్గొన్న తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గత ప్రభుత్వాలు గ్రామాల్లోని చెరువులను పట్టించుకోలేదని, ఆయకట్టు భూములు బీడుగా ఉండేవని తెలంగాణ ప్రభుత్వ హయాంలో వట్టిపోయిన చెరువుల్లోకి పుష్కలంగా సాగునీరు వచ్చి జలకళను సంతరించుకున్నాయని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన చెరువుల పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెరువుల్లో సాగునీరు పుష్కలంగా ఉండడంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కాళేశ్వరం జలాలతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి తదితరులున్నారు.

రైల్వే విద్యుత్ వైర్ల చోరీ ముఠా పట్టివేత


పట్టుబడిన ముఠా సభ్యులతో బ్లూకోల్ట్స్ సిబ్బంది

జగిత్యాలక్రైం: కొంతకాలంగా జిల్లాలో రైల్వే ట్రాక్ వెంట ఉన్న విద్యుత్ వైర్లు దొంగిలిస్తున్న ముఠాను బ్లూకోల్ట్స్ సిబ్బంది పట్టుకొని రైల్వే పోలీసులకు అప్పగించారు. మల్యాల రైల్వేస్టేషన్ సమీపంలో ఇటీవల రూ.10లక్షల విలువైన రైల్వే లైన్ విద్యుత్ రాగి వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లడంతో రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. మల్యాల–నూకపల్లి మధ్య బుధవారం అర్ధరాత్రి ముగ్గురు రైల్వే పోలీసులు తనిఖీ చేస్తుండగా ఏడుగురు దొంగలు విద్యుత్ వైర్లు చోరీ చేస్తూ కనిపించారు. వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా వారిపై రాళ్లు రువ్వి పారిపోయారు. దీంతో రైల్వేపోలీసులు డయల్ 100కు కాల్ చేసి మల్యాల బ్లూకోల్ట్స్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాజారం వైపు వెళ్తున్న గోదావరిఖనికి చెందిన ఏడుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని వి చారించారు. వారి డ్రెస్‌లు, చేతులను క్షుణ్ణంగా ప రిశీలించడంతో వారే దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారణ అయింది. దీంతో ఆ నిందితులను రైల్వే పోలీసులకు అప్పగించారు. ఈ ముఠాను పూర్తిస్థాయిలో విచారిస్తే అసలు నిజాలు వెలుగుచూడనున్నాయి.

రెండు ట్రాక్టర్లు సీజ్

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం కలిగోడ గ్రామశివారులోని అటవీ భూములను దున్నుతున్న రెండు ట్రాక్టర్‌లను గురువారం పట్టుకొని సీజ్ చేసినట్లు అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ మల్లేశం, బీట్ ఆఫీసర్ రఫీ నయీం తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు అటవీశాఖ అధికారులు వివరించారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య


వివరాలు నమోదు చేసుకుంటున్న అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రిన్సిపాల్ మోహన్ అన్నారు. మండలంలోని రాజన్నపేట, కిష్టునాయక్ తండా గ్రామాల్లో కళాశాలలో వసతులు, కల్పిస్తున్న సౌకర్యాలపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యా బోధన అందిస్తున్నట్లు తెలిపారు. పాఠ్య పుస్తకాలు, స్కాలర్‌షిప్ అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు పదో తరగతి పాసైన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లోనే చేరేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా 20మంది విద్యార్థులు కళాశాలలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణ, పర్శరాములు, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక వాహనాల పట్టివేత


పోలీసులు పట్టుకున్న ఇసుక వాహనం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్ గ్రామ శివారులో మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను పోలీసులు గురువారం పట్టుకున్నారు. స్టేషన్ హస్ అధికారి ఖాజామజార్ హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీ చేయగా వాహనాలను పట్టుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. గండికోట అశోక్, సూర శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మండు వేసవిలోనూ నిండుగా..

- మధ్యమానేరు ప్రాజెక్టులో 20 టీఎంసీల మేర నీరు
- పంటలకు జీవం పోస్తున్న 'మిడ్' మానేరు
- మిషన్ భగీరథకు సైతం నీటి విడుదల


మిడ్‌మానేరు ప్రాజెక్టు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని మాన్వాడలో ఉన్న శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టు మండువేసవిలోనూ జల కళతో కళకళలాడుతోంది. మార్చి నుంచి జూన్ మొదటి వారం వరకు ప్రాజెక్టులో సుమారు 20 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. ఏప్రిల్ 15 వరకు మధ్యమానేరు నుంచి కరీంనగర్ ఎల్‌ఎండీ ప్రాజెక్టులోకి భారీగా నీటి విడుదల చేసినా మధ్యమానేరులో నీటి నిల్వలు నిలకడగా ఉన్నాయి. గత వానాకాలం సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు కురవడం.. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి వయా రామడుగు లక్ష్మీపూర్ పంప్‌హౌస్ నుంచి వరదకాలువ మీదుగా మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి నీరు చేరడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి.

గతేడాదిలో 7 టీఎంసీలు

రెండు మూడేళ్లుగా మిడ్‌మానేరు ప్రాజెక్టులో వేసవిలో నీటి నిల్వలు భారీగా తగ్గాయి. గతేడాది జూన్‌లో కేవలం 7.38 టీఎంసీల నీరు మాత్రమే ఉండడంతో మధ్యమానేరు ప్రాజెక్టు వెలవెలబోయింది. అంతకుముందు రెండేళ్లు వేసవిలో కేవలం 10 నుంచి 13 టీఎంసీలలోపే నీరు నిల్వఉండగా యాసంగిలో రైతుల వరి పంటలకు నీరందించేవారు. ఈ ఏడాది యాసంగిలో పంటలకు నీరందించినా వేసవిలో సుమారు 20 టీఎంసీల మేర నీటి నిల్వ ఉంది.

రోజూ 215 క్యూసెక్కుల నీరు ఆవిరి

ఎండలు మండుతుంటంతో ప్రాజెక్టులో కొంతమేర నీరు ఆవిరి అవుతున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలుపుతున్నారు. ఎండలకు రోజూ సుమారు 215 క్యూసెక్కుల మేర నీరు ఆవిరి అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మిషన్ భగీరథకు 35 క్యూసెక్కులు

మధ్యమానేరు ప్రాజెక్టు నుంచి రోజూ సుమారు 35 క్యూసెక్కుల మేర నీరు మిషన్ భగీరథ పథకం కింద వినియోగిస్తున్నారు. ప్రాజెక్టులో, వరద కాలువలో పెద్ద మొత్తంలో నీరు నిల్వ ఉండడంతో మిడ్‌మానేరు ప్రాజెక్టు పరిసర గ్రామాలైన మాన్వాడ, కొత్తపేట, మల్లాపూర్, కొదురుపాక గ్రామాల్లోని వ్యవసాయ బావుల్లో నీటి ఊటలు పెరిగాయి.

పంటలకు జీవం



మిడ్‌మానేరు ప్రాజెక్టు రైతుల పంటలకు జీవం పోస్తోంది. ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి సైతం ఏటా పెద్ద మొత్తంలో నీటి విడుదల చేస్తున్నారు. గతంలో పంటలు వేద్దామంటే నీరు ఉండని పరిస్థితి. నేడు పంటలు వేసేందుకు రైతులు వ్యవసాయ భూముల కోసం వెతుకుతున్నారు. ప్రాజెక్టులో ఏటా నీరు నిల్వ ఉండడంతో రైతులు పంటలకు జీవం పోస్తోంది.
– జోగినిపల్లి రవీందర్‌రావు, రాష్ట్ర నాయకులు

నీటిని విడుదల చేశాం



మిడ్‌మానేరు ప్రాజెక్టులో ప్రస్తుతం 19.97 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. మార్చి నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులో నీటి నిల్వలు నిలకడగా ఉన్నాయి. ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీ ప్రాజెక్టులోకి ఏప్రిల్ 15 వరకు నీటిని విడుదల చేస్తాం. ఈ ప్రాంతంలోని రైతుల పంటలకు మిడ్‌మానేరు నుంచి నీటిని విడుదల చేశాం.
– జగన్, ప్రాజెక్టు ఈఈ

వర్షం కోసం.. ఆకాశం వైపు


మర్రిపల్లిలో విత్తనాలు విత్తుతున్న మహిళలు

వేములవాడరూరల్: రైతులు విత్తనాలు విత్తుకోవడం మొదలుపెట్టారు. పదిరోజుల క్రితం వచ్చిన తొలకరి జల్లులకు కొంతమంది రైతులు దుక్కులు సాగు చేసుకున్నారు. మృగశిర రాగానే వర్షాలు కురుస్తాయని ముందస్తుగా విత్తనాలు కూడా విత్తుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసిన తర్వాతే నేల తడిసిన తదుపరి విత్తనాలు విత్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నా కొందరు ముందుగానే విత్తనాలను విత్తుకున్నారు. గురువారం మృగశిర ప్రారంభం కావడంతో వర్షం కోసం రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు.

వృద్ధ దంపతులపై కుక్కల దాడి

ముస్తాబాద్(సిరిసిల్ల): ఇంటి ఆరుబయట కూర్చున్న ఒంటరి దంపతులపై వీధికుక్కలు దాడి చేశాయి. మండలంలోని నామాపూర్‌లో గురువారం రాత్రి ఇంటి ముందు కూర్చున్న గొంగటి ఎల్లయ్య(60), గొంగటి లక్ష్మి(56) దంపతులపై వీధికుక్కలు దాడిచేశాయి. లక్ష్మి ముఖం, కాళ్లపై కరిచాయి. ఎల్లయ్య కాళ్లకు గాయాలయ్యాయి. సంతానం లేని ఎల్లయ్య, లక్ష్మి దంపతులను గ్రామస్తులు 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. దంపతులపై వీధి కుక్కల దాడి ఘటనపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కుక్కలను నివారించాలని కోరుతున్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

మంథని: మంథని–కాటారం ప్రధాన రహదారి ఎక్లాస్‌పూర్ సమీపంలో లారీ బోల్తాపడిన ప్రమాదంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆజాంనగర్‌కు చెందిన డ్రైవర్ జాన్ గాయపడ్డాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం నుంచి మంచిర్యాల జిల్లా దేవాపూర్‌కు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీ ఎక్లాస్‌పూర్ శివారులో డ్రైవర్ అజాగ్రత్త వల్ల బోల్తాపడింది. గాయపడిన డ్రైవర్‌ను స్థానిక సామాజిక వైద్యశాలకు తరలించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి


శ్రీనివాస్ మృతదేహం

గంగాధర: డివైడర్‌ను ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని ఒద్యారం గ్రామంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం... రామడుగు మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి చెందిన నిమ్మనవేణి శ్రీనివాస్ (40) భార్య మంజు, కూతురు సౌజన్యతో కలిసి బుధవారం వేములవాడ మండలంలోని కోనాయిపల్లి గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. అత్త లక్ష్మీ అక్కడికి రాగా గురువారం తెల్లవారుజామున తన ద్విచక్ర వాహనంపై దింపేందుకు శ్రీనివాస్ ఎలగందల గ్రామానికి వెళ్లాడు. తిరిగి కోనాయిపల్లికి వెళ్తుండగా ఒద్యారం గ్రామ శివారులోని ఎస్వీజీ గ్రానైట్ క్వారీ సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించాడు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తికి జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): జమ్మికుంట మండలం నగురం గ్రామానికి చెందిన పొల్సాని తిరుపతిరావు తన ఇంటికి అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తుండగా విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీ నిర్వహించగా పట్టుబడ్డాడు. కరీంనగర్ విజిలెన్స్ పోలీసులు కేసు నమోదు చేసి మొదటి నేరం కింద రూ.వెయ్యి జరిమానా విధించి వదిలిపెట్టారు. మళ్లీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ రెండోసారి పట్టుబడగా కేసు నమోదు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి ఎదుట విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో తిరుపతిరావుకు రూ.2,340 జరిమానా లేదా రెండునెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. ఆయనవెంట ఎస్సైలు ఎ.నిరంజన్‌రెడ్డి, టి.నరేశ్, సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయబావి ఒడ్డున మొసలి

కథలాపూర్(వేములవాడ): మేడిపల్లి మండలం తొంబర్రావుపేట గ్రామశివారులో రైతు చిట్టెడి సతీశ్‌కు చెందిన వ్యవసాయబావి ఒడ్డున గురువారం మొసలి కనిపించింది. వెంటనే వ్యవసాయ బావిలోకి వెళ్లడంతో రైతులు భయాందోళనకు గురై అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వచ్చి పట్టుకునేందుకు యత్నిస్తున్నారు. బావిలో నీరు ఎక్కువగా ఉండటంతో మొసలిని పట్టుకునేందుకు కష్టంగా ఉందని, బావిలోని నీటిని విద్యుత్ మోటార్‌తో తొలగిస్తున్నట్లు రైతులు తెలిపారు.

వివాహం అడ్డగింత

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గంగిరెద్దుల కాలనీలో ఓ మైనర్ యువకుడి వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లో వెళ్తే.. గ్రామానికి చెందిన ఓ యువకుడికి (19) అల్గునూర్‌కు చెందిన అమ్మాయి (21)తో గురువారం వివాహం జరుగనుంది. గ్రామస్తుల సమాచారంతో ఐసీడీఎస్ అధికారులు చేరుకొని వివాహాన్ని అడ్డుకున్నారు. అమ్మాయి మేజర్ కాగా అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకపోవడంతో వివాహాన్ని నిలిపివేయాలని వారు సూచించారు. వీరి వివాహంతో పాటు మరో పెళ్లి కూడా ఆగిపోయింది. కుండమార్పిడి (ఇటు అమ్మాయి అటువైపు, అటు అమ్మాయి ఇటు వైపు) వివాహం కూడా నిలిచిపోయింది. ఐసీపీఎస్ శాంత, ఏసీడీపీఓ అరవింద ఇందిర, పోలీసు సిబ్బంది, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన పల్లె మహేందర్ రెడ్డి ద్విచక్రవాహనంపై పొలం నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టడంతో మహేందర్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. యజమాని కారుతో పరారీ కావడంతో పోలీసులకు సమాచారం అందించారు. మహేందర్‌రెడ్డిని ఈఎంటీ సతీశ్ రెడ్డి ప్రథమ చికిత్స అందించి 108లో హుజు రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలంలో కారు నంబర్ ప్లేట్ పడిపోవడంతో పోలీసులు కారు యజమాని అడ్రస్ కనుక్కున్నారు.